# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించి ఓ క్యాలెండర్ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మూడు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు చేరుకున్నారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

4. **పట్టు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

5. **తెలంగాణలో పసుపు పంటకు అనుకూల వాతావరణం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

==========================

సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించి ఓ క్యాలెండర్ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ప్రారంభించిన కలెక్టర్ల సదస్సులో సంక్షేమ శాఖలపై కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. జిల్లా కలెక్టర్లు సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని పేర్కొంటూ..

.. వాయిస్.. 30 సెకన్లు

--------------------------

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిన్న సాయంత్రం హైదరాబాద్ కు చేరుకున్నారు. హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న ఆమెకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు స్వాగతం పలికారు. రేపు రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు రాష్ట్రపతి హాజరవుతారని అధికారులు వెల్లడించారు.

--------------------------

భూముల రీసర్వే చేసిన గ్రామాల్లో వచ్చే సంక్రాంతి నాటికి 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను భూ యజమానులకు పంపిణీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సులో మంత్రి నిన్న స్వాగత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను ప్రతి రోజూ స్వీకరించేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణ కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించిందని సూక్ష్మ, చిన్న,మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అనంతపురం, విజయనగరంలో రెండు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అనుమతి తెలిపిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విస్తరణ కేంద్రాలు సాంకేతిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, కన్సల్టెన్సీ, తదితర సేవలు అందిస్తాయని వెల్లడించారు.

---------------------------

ఉపాధి కోరిన ప్రతి గ్రామీణ కుటుంబానికి 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకి పెంచడం ఒక కీలక సంస్కరణగా 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ – గ్యారంటీ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లుపై ఆయన స్పందిస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు నాణ్యమైన ఆస్తుల సృష్టికి దోహదపడే విధంగా, నిధుల దుర్వినియోగాన్ని నివారిస్తూ, పారదర్శక అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ బిల్లు అవకాశం కల్పిస్తుందన్నారు.

---------------------------

పట్టు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. వివిధ పథకాలలో భాగంగా గడచిన రెండేళ్లలో చెల్లించాల్సిన బకాయిలు 14 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మొత్తంలో 13 కోట్ల 75 లక్షల రూపాయల మేర పట్టు రైతుల బ్యాంక్ ఖాతాలకు జమ అయినట్లు తెలిపారు.

---------------------------

తెలంగాణలో పసుపు పంటకు అనుకూల వాతావరణం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ లో భారతీయ పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. జాతీయ పసుపు బోర్డు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. ధరల్లో తరచూ వస్తున్న హెచ్చుతగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతోందని తెలిపారు. ఈ పరిస్థితి మార్చేలా పసుపు బోర్డు పూర్తిస్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్

కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

భారత్, దక్షిణ ఆఫ్రికా క్రికెట్ జట్ల మధ్య లక్నో వేదికగా నిన్న జరగాల్సిన 4వ టీ20 మ్యాచ్ రద్దయింది. భారత రత్న అటల్ బిహారీ వాజ్ పేయి ఎకానా స్టేడియం పరిసర ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం అధికంగా ఉండటంతో కనీసం టాస్ వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సిరీస్‌లో చివరి టీ20 మ్యాచ్ రేపు అహ్మదాబాద్‌లో జరగనుంది.

---------------------------

అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పెరుగుతున్న వలసలను పరిగణలోకి తీసుకున్న ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ ఒక తీర్మానాన్ని చేసింది. వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యుల హక్కుల పరిరక్షణ కోసం 1990 డిసెంబర్ 18వ తేదీన ఆ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా డిసెంబర్ 18న వలసదారుల దినోత్సవంగా పాటిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయి అని అమరావతి లోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ..

వాయిస్.. 20 సెకన్లు

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని ఏజన్సీ ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది నెలకొంది.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదిలాబాద్, కామారెడ్డి, కొమరంభీమ్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన పండగను నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ, మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు రాష్ట్ర యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్. భరణి తెలిపారు. "ఆంధ్ర యువ సంకల్ప్-2కె-25" పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి ఎం. రామ్ ప్రసాద రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారని తెలిపారు.

---------------------------

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా కేంద్రంలోని పద్మావతి అతిథి గృహంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని బీసీ వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం నాణ్యమైన భోజనం తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

======================